

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం బుస్సాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతులకు సంతాపం ప్రకటిస్తున్న బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి వేముల, కమిటీ సభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, జోగు రామన్న, కోటిరెడ్డి, యాదవరెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్యయాదవ్

నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌లో రైతు అధ్యయన కమిటీతో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన రైతులు

కాంగ్రెస్ పాలనలో రైతు అనాథ

రోజుకొకరు చొప్పున బలవన్మరణం • ఆదుకునే దిశగా చొరవ చూపని సర్కారు • రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీ వేర్వేరు కాదు: నిరంజన్‌రెడ్డి

- నదీజలాలు లేకుంటే బతుకే లేదు
- రేవంత్ పాలనపై సర్వత్రా అసంతృప్తి
- రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి
- నిజామాబాద్, ఆదిలాబాద్‌లో పర్యటన

నిజామాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ఆదిలాబాద్: రాష్ట్రంలోని అన్నదాతల విశ్వాసం, నమ్మకాన్ని కాంగ్రెస్ సర్కారు కోల్పోయిందని, అనాథలం అనే భావన రైతుల్లో వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. పదమూడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సర్కారు పాలనలో దాదాపు 409 మంది తనువులు చాలించాలని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా రోజుకొకరు చొప్పున రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. రైతుల మరణాలను బహుమానాలుగా కాంగ్రెస్ సర్కారు అందిస్తున్నదని మండిపడ్డారు. రైతులను ఆత్మహత్యల వైపు పురిగొల్పేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని ధ్వజమెత్తారు. రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సభ్యులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, జోగు రామన్న, కోటిరెడ్డి, యాదవ్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్యయాదవ్ శనివారం నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మెండారో మండలం బుస్సాపూర్‌లో పర్యటించారు. అక్కడి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కమిటీ ముందు 11 మంది అన్నదాతలు కాంగ్రెస్ ఏడాది పాలనలో గోచరించిన అనుభవాలను వెళ్లబోసుకున్నారు. బోధన్ నియోజకవర్గం నవీపేట మండలం నాగేపూర్ (మట్టయ్య ఫారం)కు చెందిన గిరిజన రైతు కేతావత్ పీర్‌చంద్ గత నెలలో ఆత్మహత్య చేసుకోగా, బాధిత రైతు కుటుంబానికి బీఆర్ఎస్ తరఫున రూ.లక్ష సాయాన్ని కమిటీ బృందం అందజేసింది. అనంతరం రైతులను ద్దేశించి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వ నీతిని ఎండగట్టారు. బాధిత రైతు కుటుంబాలను ఆదుకునేందుకు బీఆర్ఎస్ తరఫున అధ్యయన బృందం పర్యటిస్తుందని తెలిపారు. రైతులకు ఈ దుస్థితి రాకుండా ఉండేందుకు వ్యవసాయ రంగంలో ఎలాంటి విధానాలు అమలు చేయాలో, ఏ విధమైన చర్యలు ఉండాలో అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. రైతుల అనుభవాలు, సలహాలు, సూచనలతో నివేదికను త్వరలోనే రైతు కమిషన్‌కు అందిస్తామని నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఈ నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకూ అందిస్తామని చెప్పారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఓదార్చుతున్న సత్యవతి రాథోడ్

రైతుల మరణాలు కలిచి వేస్తున్నాయి

'ఆదిలాబాద్ నుంచి బయలుదేరి నిజామాబాద్ సరిహద్దులోకి వచ్చినమో లేదో బజార్‌హత్నూర్‌లో మరో రైతు నర్సయ్య చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఇది చాలా దురదృష్టకరం. రైతులు మనోనిబ్బరం కోల్పోకుండా ఉండేందుకు తాము ఈ పర్యటనలు చేస్తున్నాము. మేమున్నామని రైతుల పక్షాన నిలబడుతున్నాము. కానీ ఈ ప్రభుత్వం రైతులకు భరోసా ఇవ్వలేకపోతున్నది. అందుకే బలహీనమైన క్షణాల్లో తనువు చాలిస్తున్నారు' అని నిరంజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. వండిన అన్నం గంట లేటైనా తింటామన్న నమ్మకం ఉంటుందని, ఈ ప్రభుత్వం అనేకం ఇస్తామని రైతులకు చెప్పి, ఏదో చేస్తామని నమ్మబలికి, ఇప్పుడు ఏదీ చేయలేక పోతుందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతుబంధు, ఉచిత కరెంట్, సాగు నీళ్లు, రైతుబీమా ఇలా అనేక పథకాలు ఉన్నప్పటికీ పరోక్షంగా రైతుకు జరిగిన పెద్ద మేలు పంటల కొనుగోళ్లు అని వివరించారు. ఇప్పుడు ఏడాదికాలంగా పరిస్థితి అధ్వానంగా తయారైందని, బోనస్ అని చెప్పి కొంతమంది రైతులకే అందించారు. సన్నవడ్లు అని చెప్పి నూటికి ఐదుగురికే ఇచ్చారని ధ్వజమెత్తారు. ఇలాంటి స్థితిలో రైతుకు ధీమా లేకుండా పోయిందని చెప్పారు. రెట్టింపు కౌలుకు పంటలు సాగు చేసి మోసపోవద్దని, సాత్నాల మండలంలోని రైతు ఈశ్వర్‌లా అందరూ కావద్దని సూచించారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే!

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రైతుల ఆదాయం రెండింతలు చేస్తానని 11 ఏండ్లయినా చేయని ప్రధాని మోదీని కాంగ్రెస్ అడగదని, 60 ఏండ్లయినా సన్న, చిన్నకారు రైతులకు పెన్షన్ ఇస్తామని ఇవ్వని కాంగ్రెస్‌ను బీజేపీ అడగదని నిలదీశారు. 'అడగటానికి కేవలం కేసీఆర్ ఒక్కరే అగ్గువ దొరికిండు. కేసీఆర్ రెస్ట్ తీసుకుంటే కూడా వీరికి కడుపు మంటనా? మీపై పోరాటానికి మేము లేమా? ఇంతమంది కేసీఆర్‌లం. మమ్ములను దాటుకుని వెళ్లండి' అంటూ నిరంజన్‌రెడ్డి ఆవేశంగా ప్రశ్నించారు. ప్రాంతీయ పార్టీల గొంతు నులిమేందుకు ఆ రెండు పార్టీలు ఏకమవుతున్నాయని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ సర్కారుపై దినాం నోరు పారేసుకునే వ్యక్తి ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించేందుకు నోరు వస్తలేదు అంటూ పరోక్షంగా ఎంపీ అర్వింద్‌పై నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు.

కోతల ప్రభుత్వమిది: వేముల ప్రశాంత్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేతలు, కోతల ప్రభుత్వంగా మారిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఏమేమి హామీలు ఎగ్గొట్టారో తెలుసుకోవడానికే బీఆర్ఎస్ పార్టీ రైతు అధ్యయన కమిటీ జిల్లాకు వచ్చిందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు నాట్లు వేసే సమయానికి రైతుబంధు తంచన్‌గా పడేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నాట్లప్పుడు కాకుండా ఓట్లు ఎప్పుడెప్పుడు ఉన్నయో అప్పుడే రైతుబంధు వేస్తున్నదని మండిపడ్డారు. వానకాలం ఓట్లు లేవు అందుకే వానకాలం రైతుబంధు ఎగ్గొట్టిండ్రు, మళ్లీ గ్రామపంచాయతీ ఎన్నికలు వస్తున్నయి ఇప్పుడు రైతుబంధు వేస్తమని అంటున్నరని ధ్వజమెత్తారు. అట్లనే రుణమాఫీ విషయం లోనూ అన్ని కోతలు పెట్టి అరకొర మందికే రుణమాఫీ చేశారని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో 2.03 లక్షల మందిలో కేవలం 1.01 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసిండ్రని విమర్శించారు. బాల్కొండ నియోజకవర్గంలో 51వేయి మంది రుణాలు తీసుకుంటే, రేవంత్ ప్రభుత్వం 20 వేల మందికే మాఫీ చేసిందని విమర్శించారు.

ఏడాదిలోనే ఎందుకు ఈ ఆత్మహత్యలు: రసమయి

పదేండ్లు ఆనందంగా ఉన్న రైతులు ఒక్క ఈ ఏడాదిలోనే ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రశ్నించారు. రైతుల చావులు చూడడానికి కాదు తెలంగాణ తెచ్చుకున్నదని, రైతులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో మీ ముందుకువచ్చామని తెలిపారు. రైతుల్లో దేవుడిని చూసిన ఏకైక వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం ఉండలేదని, రైతులు ధైర్యాన్ని కోల్పోకుండా సమస్యలపై పోరాడాలని, ఇక ఆత్మహత్యలు వద్దు కొట్లాడుదామని పిలుపునిచ్చారు.

కృష్ణా, గోదావరి లేకపోతే తెలంగాణకు బతుకులేదు

కృష్ణా, గోదావరి లేకపోతే తెలంగాణకు బతుకే లేదని నిరంజన్‌రెడ్డి చెప్పారు. నీళ్లు ఎట్లా దాఖలు పరుచుకోవాలో వారికి తెలయడం లేదని విమర్శించారు. నీళ్లను దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నాలే జరగడం లేదని చెప్పారు. లిఫ్టుల నుంచి నీళ్లు ఇచ్చుకునే పరిస్థితి లేదన్నారు. సాగు నీటి సరఫరాపై రాష్ట్ర పాలకులకు పట్టింపు లేదని, ఆంధ్రోళ్లు గండిపెట్టి నదీ జలాలను తరలించుకుపోయేందుకు భారీ కుట్ర జరుగుతుందని ధ్వజమెత్తారు. నిజామాబాద్ సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి

దేశంలో రైతుల ఆత్మహత్యలు పూర్తిగా తగ్గిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేసీఆర్ హయాంలో పార్లమెంట్‌లో కేంద్రమే ప్రకటించిందని, అలాంటిది ఇప్పుడు రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఎందుకు పెరుగుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డిని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. రైతులకు ధైర్యం చెప్పేందుకు వచ్చిన తనకు బుస్సాపూర్ వచ్చాక తనకే ధైర్యం వచ్చిందని తెలిపారు. రైతులు మాట్లాడిన తీరు చూస్తుంటే ఆశ్చర్యం వేసిందని, ఇంత అవగాహన ఉన్న రైతులు ఎట్లా కేసీఆర్‌ను చేజార్చుకున్నారంటూ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఏవర్గమూ సంతోషంగా లేదని, కాంగ్రెస్‌కు ఓటేసిన ఆ పార్టీ కార్యకర్తలు కూడా సంతోషంగా లేరని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇది అసలు కాంగ్రెస్ కాదని, కిరాయి కాంగ్రెస్‌లా ఉదని ఎద్దేవా చేశారు.

ఆశపడ్డం.. మోసపోయినం!

మొదటిపేజీ తరువాయి...

పర్యటించింది. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఒక్క బుస్సాపూర్ రైతులే కాకుండా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు కూడా తమ బాధలు చెప్పుకొనేందుకు బుస్సాపూర్‌కు తరలివచ్చారు.

కమిటీ ఎదుట బాధలు ఏకరువు

అధ్యయన కమిటీ ఎదుట రైతులు పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు ఆశపడి మోసపోయినట్టు వాపోయారు. రైతుభరోసా 15 వేలు ఇస్తరని, 2 లక్షల రుణమాఫీ చేస్తరని ఆశపడ్డట్టు స్వయంగా రైతులే చెప్పారు. అప్పుడు ఓటేసిన పాపానికి ఇప్పుడు అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. మోసపూరిత హామీలిచ్చి ఓట్లు వేయించుకొని రేవంత్‌రెడ్డి గద్దెనెక్కారని మండిపడ్డారు,. కాంగ్రెస్ మోసం అలవ్యంగా అర్థమైందని వాపోయారు. కేసీఆర్ ఉన్నప్పుడు దేనికీ లోటు లేకుండా ఉండేదని నాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. తుకాలు పోసేటప్పుడే తంచనుగా రైతుబంధు సాయం ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారులో అన్నీ అందని ద్రాక్షగానే మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే వానకాలం రైతు భరోసాను ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు యాసంగి రైతుబంధు ఇస్తదో లేదోననే అనుమానం వ్యక్తంచేశారు. రుణమాఫీపై మాట్లాడుతూ సర్కారుపై ఇంతెత్తున లేశారు. ఆ గ్రామంలో 80 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, 51 వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉంటే కేవలం 20 వేల మందికే అయిందని, ఇంకా 31 వేల మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ ఎగ్గొట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంటలకు సాగు నీరు కూడా అందడం లేదని, గతంలో ఈ సమయానికి కేసీఆర్ కాళేశ్వరం నీళ్లతో చెరువులు, కుంటలు నింపితే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ఎండబెడుతున్నదని మండిపడ్డారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదని, లో ఓల్టేజీతో మోటర్లు కాలిపోతున్నాయని, వాటిని రీపేర్ చేయించినప్పుడల్లా 10 వేల దాకా ఖర్చవుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

కలిసి పోరాడుతం

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో మోసపోయిన తాము మళ్లీ మోసపోయేందుకు సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ సర్కారుపై ఏడాదిలోనే విరక్తి పుట్టిందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ పార్టీని గద్దె దించేవరకు రైతులమంతా కలిసి పోరాడుతామని తేల్చిచెప్పారు. ఇప్పుడు మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున పథకాల పేరుతో కాంగ్రెస్ హంగామా చేస్తున్నదని, మరోసారి రైతులను, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తామని తేల్చిచెప్పారు.

కేసీఆర్.. కొండంత ధైర్యం

కాంగ్రెస్, కేసీఆర్ పాలనను పోల్చిచూపిన రైతులు, తమకోసం కేసీఆర్ చేసిన పనులను గుర్తు చేసుకుంటూ ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్ ఉన్నప్పుడు కొండంత ధైర్యంగా ఉండేదని, ఇప్పుడు ఆ ధైర్యం కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. పంట పండించటం నుంచి అమ్ముకునే వరకు అన్ని విధాలా రైతులకు కేసీఆర్ అండగా నిలిచారని, ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని వాపోయారు. 'చెట్టు పెట్టి నీడనిచ్చే వ్యక్తి కేసీఆర్ అయితే.. ఆ చెట్టును నరికి పొయ్యిలో పెట్టే వ్యక్తి రేవంత్‌రెడ్డి' అంటూ ఓ రైతు వ్యాఖ్యానించారు. అదే విధంగా 'వద్దురా రేవంత్ వద్దురా.. మన కేసీఆరే ముద్దురా' అంటూ కేసీఆర్‌పై తనకున్న ప్రేమను రైతు జైది సాయన్న పాటతో వ్యక్తపరిచారు.

సర్పంచ్ ఎన్నికల కోసం మళ్లీ నాటకాలు

అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాటలకు మోసపోయినం. కాంగ్రెసోళ్లు సుతం మోసపోయినమని అంటున్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై అన్ని గ్రామాల్లో చర్చపెట్టాలి. ఒక్క సంవత్సరంలోనే కాంగ్రెస్ సర్కారుపై విరక్తి వచ్చింది. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలు ఉన్నయి కాబట్టి మళ్లీ పథకాలని నాటకాలు ఆడుతున్నరు. మళ్ల మోసపోం. ఊర్లలో కాంగ్రెస్‌ను నిలదీస్తం.. బుద్ధి చెప్తం.

-నర్సారెడ్డి, రైతు, తోటపల్లి

పదేండ్లలో నీళ్ల కోసం పైసా ఖర్చు చేయలే

ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల కోసం నా పొలంలో 38 బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. కానీ కేసీఆర్ సారు పుణ్యం, దయ వల్ల తోటపల్లి రిజర్వాయర్ నీళ్లు వచ్చినయి. బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు పదేండ్లలో నీళ్ల కోసం పైసా కూడా ఖర్చు చేయలేదు. ఇప్పుడు పాత రోజులు మళ్లీ వచ్చినయ్. తోటపల్లికి కాంగ్రెస్ సర్కారు నీళ్తిస్తలేదు. పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది.

- గడ్డం రాజశేఖర్‌రెడ్డి, రైతు, బుస్సాపూర్

రైతన్న కడుపులో పుట్టెడు దుఃఖం

- ఏడాదిగా నలిగిపోతున్న అన్నదాత
- కదిలిస్తే కట్టలు తెగుతున్న ఆవేదన
- బీఆర్ఎస్ కమిటీ ఎదుట గోడు వెల్లబోసుకుంటున్న అన్నదాతలు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు ఏడాది ఏలుబడిలో రైతులు ఎంతలా ఇబ్బంది పడుతున్నారో మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన రైతు అధ్యయన కమిటీ నిర్వహిస్తున్న సమావేశాల్లో స్పష్టమవుతున్నది. కమిటీ పర్యటనల్లో ప్రతీ రైతు ఆవేదనను పంచుకుంటున్నారు. ఏ రైతును కదిలించినా ఏడాదిగా కడుపులో దాచుకున్న అంతులేని బాధను వెళ్లబోసుకుంటున్నారు. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు రైతు అధ్యయన కమిటీ ధైర్యాన్ని అందిస్తున్నది.

ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ

బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ శనివారం నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో రైతులు తమ సమస్యలు చెప్పుకున్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాక పెట్టుబడికి ఇబ్బందిగా మారిందని తెలిపారు. అమలుకు నోచుకోని రుణమాఫీ, వేధిస్తున్న కరెంటు కోతలు, సాగునీటి కొరతతో అవస్థలు పడుతున్నామని చెప్పారు. పంట కొనకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆవేదనను వెల్లడించారు. సమావేశంలో ఒక్కో రైతు 5 నుంచి 10 నిమిషాల పాటు మాట్లాడారు. ఏడాదిగా కడుపులో దాచుకున్న గోడును వెళ్లగక్కారు.

కన్నీటిని తుడుస్తున్న కమిటీ

రైతు అధ్యయన కమిటీ సభ్యులు అన్నదాతల బాధ వింటూ ధైర్యం నింపుతున్నారు. దీంతో కమిటీని చూడగానే రైతుల్లో భరోసా వస్తున్నది. ఎదురొచ్చి గ్రామాల్లోకి ఆహ్వానిస్తున్నారు. రైతులు పిడికిలి బిగించి సమరానికి సిద్ధమంటూ నినదిస్తున్నారు. అధ్యయనంలో భాగంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రుణమాఫీ, రైతుభరోసా, ఇతర అంశాలపై రైతులను ప్రశ్నలు అడుగుతున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అయిందా? అని ప్రశ్నిస్తుంటే అక్కడున్న 99 శాతం మంది రైతులు కాలేదని చెప్తున్నారు. 'అంతా ఉత్తదే.. ఉత్తదే' అంటూ నినాదాలు చేస్తున్నారు.

ఫిర్యాదుల వెల్లువ

బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ ముందు సమస్యలను ఏకరవు పెడుతున్న అన్నదాతలు ఫిర్యాదులు కూడా అందిస్తున్నారు. శనివారం బుస్సాపూర్ సమావేశానికి చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా తరలివచ్చారు. ఒక్క సమావేశంలోనే 82 ఫిర్యాదులు అందాయంటే రైతులు ఎంతటి కష్టాల్లో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

- ఎస్సారెస్పీ జలాల కోసం రోడ్డెక్కిన రైతులు

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు, జామ్లాతండా రైతులు శనివారం పార్వతమ్మగూడెం సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వ వద్ద తొర్రూరు–మహబూబాబాద్ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఐబీ ఏఈ వినయ్ వచ్చి జలాల విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. -నెల్లికుదురు

కౌలురైతు ఇంట కన్నీటిసాగరం

- అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య
- కూలితో కుటుంబం గడవని స్థితి
- కూతుళ్లను సాకేందుకు అష్టకష్టాలు
- 8 లక్షల అప్ప అట్టనే ఉన్నది
- కన్నీటితో కాలం వెళ్ల దీస్తున్నా
- ఆత్మహత్య చేసుకున్న రైతు మ్యాక శ్రీనివాస్ భార్య లత ఆవేదన
- ఆ రైతు కుటుంబానికి ఇప్పటికీ ఆసరా ఇవ్వని కాంగ్రెస్ సర్కారు

ఇది ఓ కౌలురైతు ఇంట కన్నీటిగాథ. మ్యాక శ్రీనివాస్ పడికరాల భూమి కౌలుకు చేస్తే, రూ.8 లక్షల అప్పయింది. సాగునీటి కష్టాలు, పంట దిగుబడి నష్టాలతో ఒక కారు, అధిక వర్షాలతో పంటంతా పోయి ఇంకో కారు ఆ కౌలు రైతుకు నష్టాలే మిగిలాయి. ఇక ఆ అప్ప తీర్చేదారి కనిపించలేదు. సర్కారు సాయంచేసే కనికరం చూపలేదు. ఇక చావే దిక్కనుకున్నాడు. నిరుడు డిసెంబర్‌లో పురుగుల మందు తాగి తనువు చాలించాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆ రూ.8 లక్షల అప్ప మిగిలే ఉన్నది. పిల్లలను సాకేందుకు కూలిపనులకు పోతుంది. అప్ప తీర్చేదెలా? అని ఆయన పోయినప్పటి నుంచి నిత్యం మదనపడుతూ నరకయాతన అనుభవిస్తున్నది.



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్‌లో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు మ్యాక శ్రీనివాస్ ఇంటి ఆవరణలో కుటుంబ సభ్యులు. (ఇన్‌సెట్‌లో)శ్రీనివాస్ ఫొటోతో భార్య లత

కరీంనగర్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన మ్యాక శ్రీనివాస్ లారీ డ్రైవర్. ఆయనకు భార్య లత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పదేండ్లపాటు లారీ నడుపుతూ జీవనం సాగించిన ఆయన వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే ఉండాలని నిర్ణయించుకున్నాడు. తన తండ్రి పేరిట ఉన్న కొద్దిపాటి భూమిని ముగ్గురు సోదరులు పంచుకోవాల్సి ఉన్నది. ఈ దశలో కౌలుకు తీసుకొని వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్న శ్రీనివాస్ ఎకరానికి రూ.30 వేల చొప్పున ఏడు ఎకరాలకు రూ.2.10 లక్షలు చెల్లించి కౌలుకు తీసుకున్నాడు. ఈ భూమిలో సాగుచేసిన పంట ఒక సీజన్‌లో నీటి సదుపాయం లేక ఆశించినంతగా దిగుబడి రాలేదు. వచ్చిన దిగుబడిలో పెట్టుబడి కూడా చేతికి రాలేదు. ఆ సీజన్‌లో కౌలు మీద పడింది. మరో సీజన్‌లోనైనా పంట వస్తుందని ఆశించి మరింత అప్పుచేసి మరో ఏడాది అంతే భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఈ సీజన్‌లో అధిక వర్షాలతో పంట దెబ్బతిన్నది. ఇంకో పంట వేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకుండాపోయింది. అప్పటికే రూ.8 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. వీటిని తీర్చే దారి కనిపించక శ్రీనివాస్ తీవ్ర మనస్తాపం చెంది నిరుడు డిసెంబర్ 22న తన ఇంటి వెనుకాలే విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆవిరైన కుటుంబం ఆశలు

ఇద్దరు ఆడపిల్లలను చక్కగా చదివించి వాళ్లకు మంచి జీవితాన్ని ఇవ్వాలనుకున్న శ్రీనివాస్, లత ఆశలన్నీ ఆ ఇంటి పెద్ద మరణంతో ఆవిరయ్యాయి. పెద్దమ్మాయి ఇప్పుడు హుజూరాబాద్‌లోని ఓ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. చిన్న కూతురు మూడో తరగతి చదువుతున్నది. వీళ్ల పోషణకు లత పడరాని పాట్లు పడుతున్నది. అత్తామామలు కట్టిన ఇంటిలో తమ వాటా కింద ఇంత చోటిచ్చినా లతకు బతుకుదెరువు మాత్రం లేదు. ఆమె ఊరిలో దొరికే కూలిపనులకు చేసుకుంటూ పిల్లల్ని పోషించుకుంటున్నది. మామ రాజయ్య ఇచ్చిన 20 గుంటల భూమిలో పంట తీసుకుంటున్నది. కానీ, అది పిల్లల పోషణకు ఏ మాత్రం సరిపోవడంలేదు. శ్రీనివాస్ పేరిట కనీసం కొంత భూమి ఉన్నా ఆమెకు రైతు బీమా కింద రూ.5 లక్షలు వచ్చేవి. శ్రీనివాస్ మరణంతో ఇంత దీనస్థితికి చేరిన ఈ కుటుంబానికి ఇప్పటికీ రూ.8 లక్షల అప్పు అలాగే ఉన్నది.

అప్పెలా తీర్చాలో అర్థమైతలేదు?

'నా భర్త మరణంతో మా ఇల్లు ఆగమైంది. ఇద్దరు ఆడ పిల్లలు. కూలినాలీ చేసుకొని వాళ్లను పోషించుకుంటున్న. ఆయన పేరిట భూమి లేదని రైతుబీమా సుతం రాలేదు. చేసిన అప్పు రూ.8 లక్షలు ఇంకా అట్లనే ఉంది. ఏంచేసి తీర్చాలో అర్థంమైత లేదు'' అంటూ ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు శ్రీనివాస్ భార్య లత ఆందోళన వ్యక్తం చేసింది.

కౌలురైతు కుటుంబానికి కనికరం ఏది?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల్లో మ్యాక శ్రీనివాస్ ఒకరు. ప్రభుత్వం కనీసం సాయం చేయాలనే ఆలోచనే చేయలేదు. కనీసం అధికార పార్టీ నాయకులు కూడా పరామర్శించింది లేదు. ప్రభుత్వ పరంగా కనీసం విచారణనైనా చేయనేలేదు. ఈ పరిణామాలు ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల కుటుంబాలకు శాపాలుగా మారుతున్నాయి. శ్రీనివాస్ మరణంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, ఇద్దరు ఆడపిల్లలను చదివించేందుకు ఆయన భార్య లత పడుతున్న కష్టం వర్ణనాతీతం అని స్థానికులు సానుభూతి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

ఉరి కొయ్యకు మరో ఇద్దరు రైతులు

- ఆదిలాబాద్‌లో ఒకరు, పెద్దపల్లిలో మరొకరు
- రైతు భరోసా లేక, అప్పులు తీరక ఆత్మహత్య
- రాష్ట్రంలో కొనసాగుతున్న అన్నదాతల బలవన్మరణాలు

నర్సయ్య(ఫైల్),

నర్సయ్య(ఫైల్)

ఇప్పటికి రాలిన మట్టిపూలు 411

ఆదిలాబాద్, ధర్మార